క్లుప్తంగా

చలివేంద్రం ప్రారంభం



భీమవరం టుటౌన్ పోలీసుస్టేషన్ వద్ద చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సీఐ శ్రీనివాస్

భీమవరం: వేసవి ఎండలు విపరీతంగా ఉన్న సమయంలో పాదచారులు, ప్రజల దాహార్తిని తీర్చడానికి చలి వేంద్రాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని భీమవరం టుటౌన్ సీఐ జి శ్రీనివాస్ అన్నారు. టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో దాతల సహకారంతో శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని శ్రీనివాస్ ప్రారంభించిన సందర్భంగా మాట్లాడారు. నిర్వాహకుడు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ నెలరోజుల పాటు పోలీసు స్టేషన్ వద్ద చలివేంద్రం నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ లయన్స్‌క్లబ్ ఉపాధ్యక్షుడు నరహరిశెట్టి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఉన్నత స్థాయికి చేరుకోవాలి



చిలుకూరు లూథరన్ చర్చ్‌లో స్త్రీల కార్యక్రమాలు నిర్వహిస్తున్న దృశ్యం

ఉండి: సమాజంలో, కుటుంబంలో మహిళ గౌరవింపబడాలంటే ఆమె ఉన్నతంగా ఎదగాలని ఎన్నార్పీ అగ్రహారం పేరిష్ లూథరన్ చర్చ్‌ల మహిళాధ్యక్షురాలు వీ రాజమణి అన్నారు.ఆదివారం చిలుకూరు లూథరన్‌చర్చ్‌లో స్త్రీల ఆదివారం కార్యక్రమాన్ని కన్వీనర్ ఇజ్జిని సువార్త ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా స్త్రీల ప్రత్యేక కీర్తనలు,పాటలతో యేసుక్రీస్తును స్తుతించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ స్త్రీల ఆలోచనలు ఉన్నతంగా ఉండాలని అన్నారు. అన్ని రంగాల్లోను మహిళ ముందుకు సాగితేనే స్వేచ్ఛ స్వాతంత్ర్యాలు లభిస్తాయన్నారు. దేవునితో సాన్నిహిత్యాన్ని పెంచుకుని కుటుంబంలో కూడా ఆధ్యాత్మికతను పొందించాలన్నారు. దైవ భయం కలిగి ఉంటే మనిషి అన్ని విషయాల్లోను గొప్పగా ఎదుగుతాడని, అభివృద్ధి చెందుతారన్నారు. మహిళ దేవుని భయం కలిగి క్రీస్తు ఉపదేశాలను అనుసరించి నడుచుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిస్టర్ బేబీ సరోజిని, సుందరమణియువరాజు, స్త్రీల సమాజ ప్రతినిధులు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ఉద్యోగులు ఆలోచించి ఓటు వేయాలి



తిర్రే బాబూరావు

నరసాపురం : ఓట్లు వేసే క్రమంలో ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు ఆలోచన చేసి వైఎస్సార్ సీపీ అభ్యర్థులకు మద్దతుగా ఉండాలని మున్సిపల్ రిటైర్డ్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ తిర్రే బాబూరావు సూచించారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అందిస్తూ, ప్రభుత్వ ఉద్యోగుల జీతాలు ఆలస్యం చేస్తున్నరని ప్రతిపక్షాలు ప్రచారం చేస్తున్నాయని అన్నారు. అయితే ఇప్పుడు టీడీపీ అధినేత చంద్రబాబు అంతేకంటే ఎక్కువ మోసపూరిత హామీలతో ముందుకు వస్తున్నారని చెప్పారు. చంద్రబాబు హామీలు అమలు చేయడం అసాధ్యమని పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమానికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తూనే ఉన్నారన్నారు. ప్రతిపక్షాలు కుట్రపూరిత విష ప్రచారాన్ని గమనించాలని కోరారు. పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునే ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు విజ్ఞత చూపించాలని చెప్పారు. గతంలో ఉద్యోగులపై చంద్రబాబు వ్యవహరించిన తీరును గుర్తు చేసుకోవాలని సూచించారు.

ఎన్నికలను విజయవంతం చేయడానికి చర్యలు

నరసాపురం: మే 13న జరగనున్న ఎన్నికల ప్రక్రియను విజయవంతంగా ముగించడానికి అన్ని చర్యలు చేపట్టినట్టు నరసాపురం ఆర్డీఓ, నరసాపురం అసెంబ్లీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎం.అచ్యుత్ అంబరీష్ చెప్పారు. ఆదివారం ఆయ విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణపై పోలింగ్ సిబ్బందికి పలుమార్లు ఇప్పటికే శిక్షణ కార్యక్రమాలు నిర్వహించామని చెప్పారు. అభ్యర్థుల ప్రచార ఖర్చు అంశంలో గట్టి నిఘా ఉంచామని వివరించారు. పోలింగ్ కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని చెప్పారు. ఇప్పటికే అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశామని పేర్కొన్నారు.

భక్తులతో ముత్యాలమ్మ ఆలయం కిటకిట

మొగల్తూరు: మండలంలోని ముత్యాలపల్లిలో ఉన్న శ్రీ బండి ముత్యాలమ్మను దర్శించుకునేందుకు ఆదివారం భక్తులు భారీగా తరలివచ్చారు. అమ్మవారి దర్శనానికి వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ ఈఓ డి.రామకృష్ణంరాజు, ఆలయ చైర్మన్ కడలి మాణిక్యాలరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఇంటి ముంగిటకే వైద్యం

- సామాన్యులకు చేరువైన ఫ్యామిలీ డాక్టర్
- జగన్ ప్రభుత్వంలో మెరుగైన వైద్యసేవలు



గ్రామీణ ప్రాంతంలో ఫ్యామిలీ డాక్టర్ వైద్య సేవలందించేందుకు సిద్ధంగా ఉన్న 104 వాహనం, సిబ్బంది

ఆకివీడు: ధనికుడికే కాదు, పేదోడూ గర్వంగా చెప్పుకునే విధంగా ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టింది. రెండేళ్లగా ఫ్యామిలీ డాక్టర్ గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలందిస్తూ, ప్రజల ఆరోగ్యాల్ని కాపాడుతున్నారు. ధనికులకు ఫ్యామిలీ డాక్టర్ ఉంటారు. ఆయన నిత్యం తన పేషెంట్ ఆరోగ్యాన్ని పరీక్షిస్తూ, పలు సూచనలిస్తూ సేవలందిస్తారు. అందుకు భారీ రుసుము తీసుకుంటారు. అదే తరహాలో పేదోడి ఆరోగ్యం భద్రంగా ఉండాలనే ఆశయంతో సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రెండేళ్ల క్రితం ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని తీసుకువచ్చారు. మెరుగైన వైద్యం అందజేసేందుకు ప్రతి నెలలో 26 రోజులు ఫ్యామిలీ డాక్టర్ ఆయా గ్రామాలు వెళ్లి ప్రజల ఆరోగ్య స్థితిగతుల్ని తెలుసుకుంటున్నారు. 14 రకాల పరీక్షలు ఉచితంగా నిర్వహించి, రోగికి మందులను అందజేస్తున్నారు. వీటితో పాటు రక్త పరీక్షలు చేసి బీపీ, సుగర్, ఇతర వ్యాధుల్ని నిర్ధారిస్తున్నారు. అవసరమైన వారికి గుండె పరీక్షలు కూడా చేపట్టి ఆరోగ్య శ్రీ ద్వారా ఆపరేషన్లు చేయిస్తున్నారు. ఫ్యామిలీ డాక్టర్ ఆయా గ్రామాల్లోని విలేజ్ క్లినిక్‌లకు అనుసంధానంగా పనిచేసి, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్ల సహాయం తీసుకుంటున్నారు. ఉండి నియోజకవర్గంలో గత రెండేళ్లలో సుమారు 1,849 ఫ్యామిలీ డాక్టర్ క్యాంపులు నిర్వహించారు. ఆయా క్యాంపులలో సుమారు 2,46,074 మంది రోగులకు వివిధ పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. గుండె, ఇతర దీర్ఘవ్యాధులున్న వారికి మెరుగైన వైద్యం అందజేసేందుకు పెద్దాసుపత్రులకు తరలించారు. ఆ విధంగా నియోజకవర్గంలో సుమారు 50 మందికి పైగా రోగుల్ని వివిధ ఆసుపత్రులకు తరలించారు. అవసరమైన వారికి ఆరోగ్యశ్రీ ద్వారా ఆపరేషన్లు చేయించారు. మందులు అవసరమైన వారికి ఇంటింటికీ పోస్టు ద్వారా కూడా సరఫరా చేస్తున్నారు. ఫ్యామిలీ డాక్టర్ రావడానికి ముందే గ్రామస్తులు డాక్టర్ కోసం వేచి చూస్తున్నారు. సుగర్ పరీక్షలు, రక్త పరీక్షలు, నీరుడు పరీక్షలు వంటి వాటిని చేయించుకుంటున్నారు.

ఫ్యామిలీ డాక్టర్ క్యాంపుల వివరాలు

మండలం	క్యాంపులు	రోగులు	పరీక్షలు
ఆకివీడు	468	79,167	16
కాళ్ళ	328	16,400	14
పాలకోడేరు	576	87,477	8
ఉండి	477	63,030	12
మొత్తం	1,849	2,46,074	50

బీపీ, సుగర్ ప్రతీ నెలా పరీక్షలు చేయించుకుని అవసరమైన మందుల్ని తీసుకోవడం ద్వారా అవి నియంత్రణలో ఉంటున్నాయి.

జాతీయ స్థాయిలో రోగి వివరాలు నమోదు

ఫ్యామిలీ డాక్టర్ విధానం ద్వారా ప్రతీ వ్యక్తి వివరాల్ని డిజిటలైజ్ చేస్తారు. ప్రతీ పౌరుడికి డిజిటల్ హెల్త్ ఐడీ ఇస్తారు. ఐడీ కేంద్ర ఆయుష్మాన్‌భారత్ డిటిటల్ మిషన్‌లో పొందుపరుస్తారు. 14 రకాల డయాగ్నోస్టిక్ ర్యాపిడ్ కిట్స్ ద్వారా పరీక్షలు నిర్వహిస్తారు, 105 రకాల మందుల్ని అందుబాటులో ఉంచి, రోగులకు అందజేస్తున్నారు.

డాక్టర్ సేవలీవిధంగా..

ఫ్యామిలీ డాక్టర్ సేవల్ని ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ గ్రామానికి వచ్చిన 104 వాహనంలోనే ఓపీ చూస్తారు. మధ్యాహ్నం నుంచి మంచానికి పరిమితమైన రోగులు, వృద్ధులు, దివ్యాంగులు వద్దకు వెళ్లి ఇంటి వద్దే సేవలందిస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లోనూ, ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు ఆరోగ్య వివరాలు సేకరించి, అవసరమైన వారికి పరీక్షలు, వైద్యసేవలు అందిస్తున్నారు.



గుండె వైద్య పరీక్షలు చేయించుకుంటున్న రోగి



అయిభీమవరంలో చిన్నారికి వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్



ఫ్యామిలీ డాక్టర్ క్యాంప్‌లో బీపీ పరీక్షలు చేయించుకుంటున్న వ్యక్తి

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భీమవరం అర్బన్: మండలంలోని పెదగరువు విద్యుత్ ఉప కేంద్ర పరిధిలో 11కేవీ విద్యుత్ వార్షిక మరమ్మతుల నిమిత్తం పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పీర్ అహ్మద్‌ఖాన్ ఆదివారం తెలిపారు. పెదగరువు, రాజుల గరువు, వెంప, శ్రీరామపురం, శ్రీమన్నారాయణపురం గ్రామాలకు ఉదయం 6 నుంచి 11ల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

అల్లూరి శత వర్ధంతి కార్యక్రమానికి భారీగా తరలిరండి

కాళ్ల : మన్యం వీరుడు, స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు శతవర్ధంతి కార్యక్రమంలో ప్రతీ ఒక్కరూ పాల్గొనాలని రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ పాతపాటి శ్రీనివాసరాజు కోరారు. ఈ సందర్భంగా ఆదివారం విలేకర్లతో మాట్లాడుతూ ఈ నెల 7వ తేదీన భీమవరంలో జరగనున్న అల్లూరి శత వర్ధంతి కార్యక్రమానికి అభిమానులు,అల్లూరి సేవా సమితి సభ్యులు భారీగా తరలిరావాలని కోరారు. ఆయన దేశానికి చేసిన సేవలను యువత తెలుసుకుని ఆయన అడుగుజాడల్లో నడుచుకోవాలని శ్రీనివాసరాజు పిలుపునిచ్చారు.

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి



చినమిల్లిపాడు గ్రామంలో సార్వత్రిక ఎన్నికలపై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ జీ.నాగబాబు

ఆకివీడు: ప్రజాస్వామ్య పద్ధతిలో ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని ఎస్ఐ బీ.నాగబాబు చెప్పారు. మండలంలోని చినమిల్లిపాడు గ్రామంలో సార్వత్రిక ఎన్నికలపై అవగాహనా సదస్సును ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటు హక్కును ప్రతి వ్యక్తి సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రలోభాలకు లొంగవద్దన్నారు. క్రిమినల్ చర్యలకు పాల్పడి, క్రిమినల్ కేసుల్లో ఇరుక్కోవద్దని హెచ్చరించారు. గతంలో జరిగిన ఎన్నికల వాతావరణంను బట్టి మండలంలో సమస్యాత్మక గ్రామాల్ని గుర్తించామన్నారు. గ్రామాల్లో గొడవలు పడటం వల్ల అవి చిరస్థాయిగా నిలిచిపోతాయన్నారు. శాంతియుత వాతావరణంలో ఎవరి ఓటు వారు వేయడం ద్వారా ప్రజాస్వామ్యాన్ని కాపాడినట్లు అవుతుందని చెప్పారు. కార్యక్రమంలో గ్రామంలోని నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చెప్పాడంటే చేసే వ్యక్తి జగన్



కేపీ పాలెం సౌత్‌లోని అల్లంవారిమెరకలో ఓట్లు అభ్యర్థిస్తున్న శ్రీకృష్ణంరాజు

మొగల్తూరు : చెప్పాడంటే చేసే వ్యక్తి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని అలాంటి వ్యక్తికి ముఖ్యమంత్రిగా మరోసారి అవకాశం ఇవ్వాలని వైఎస్సార్ సీపీ అసెంబ్లీ అభ్యర్థి ముదునూరి ప్రసాదరాజు కుమారుడు శ్రీ కృష్ణంరాజు ఓటర్లను కోరారు. ప్రజాశీర్వాద ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం మండలంలోని కేపీ పాలెం సౌత్ పంచాయతీలోని తల్లంవారి మెరక, అందే వారి మెరక, ఉప్పులూరి వారి మెరక, కొండేటి వారి మెరక తదితర ప్రాంతాల్లోఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామంలోని ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమ పథకాలు గురించి తెలిపే బ్రోచర్‌లను అందించారు. ఈ ఐదు సంవత్సరాల్లో మీ గ్రామంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని, కోట్లాది రూపాయలతో తీర ప్రాంత గ్రామాల్లో రహదారులు అభివృద్ధి చేసుకున్నామని, మరికొన్ని నిర్మాణంలో ఉన్నాయన్నారు. గ్రామం మరింత అభివృద్ధి చెందాలంటే ఈ నెల 13న జరుగబోయే ఎన్నికల్లో మీ రెండు ఓట్లలో ఒక ఓటును అసెంబ్లీ అభ్యర్థి ముదునూరి ప్రసాదరాజుకు, మరో ఓటును పార్లమెంట్ అభ్యర్థి గూడూరి ఉమాబాలకు ఫ్యాన్‌గుర్తుపై వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో సర్పంచ్ కడలి సోంబాబు, ఎంపీటీసీ సభ్యుడు డీవీవీ సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ నాయకులు అల్లం అంజిబాబు, అందే తాత, కర్రి ఏసుబాబు, కంచర్ల బాబులు, అల్లం అంజిబాబు, కోడెళ్లి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

జగన్ పాలనకు అందరి మద్దతు

రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్



రజకుల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

భీమవరం(ప్రకాశం చౌక్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రంలో ప్రజలందరూ మద్దతు తెలుపుతున్నారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. ఆదివారం పలు వార్డుల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించి ప్రజల నుంచి ఓట్లు అభ్యర్థించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి పాదయాత్ర చేసిన సమయంలో పేదల సమస్యలను స్వయంగా తెలుసుకుని నవరత్న పథకాలను అమలు చేశారన్నారు. పథకాలే కాదు భావితరాలు ఆరోగ్యంగా ఉండాలని అంగన్‌వాడి కేంద్రాలల్లో, పాఠశాలల్లో చిన్నారులకు, గర్భిణీ స్త్రీలకు, బాలింతలకు విద్యార్థులకు బలమైన పౌష్టికాహారాన్ని అందించారన్నారు. పిల్లల చదువుల భారం తల్లిదండ్రులపై పడకుండా ప్రభుత్వమే విద్యను ఒక బాధ్యతగా తీసుకొని అమ్మ ఒడి, జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన, విదేశీ విద్య, విద్యా కానుక లాంటి అనేక సంక్షేమ పథకాలను అమలు చేశారన్నారు. నాడు నేడు పథకంలో ప్రభుత్వ పాఠశాలను కార్పొరేట్ స్థాయికి మించి అభివృద్ధి చేశారన్నారు. అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమం అందజేసిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి అయితనే మరింత సంక్షేమం, అభివృద్ధి జరుగుతందన్నారు. ఆయన సహకరంతో భీమవరం నియోజవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానని తననుకు భీమరం ప్రజలు మరో అవకాశం కల్పించాలని ఎమ్మెల్యేగా తనకు, ఎంపీగా గూడూరి ఉమాబాలను ప్రజలు అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు.

చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు:

గతంలో ఎన్నడు లేని విధంగా ఈ వేసవిలో ఎండలు ఎక్కువగా ఉన్నాయని ఉష్ణోగ్రతలు కూడా రోజురోజుకు పెరుగుతున్నాయని ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. ఆదివారం పలు చర్చిలలో ఆయన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. పాస్టర్ల నుంచి ఆశీర్వాదాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతికి మూలం ఏసుక్రీస్తు అని, ప్రతి ఒక్కరు శాంతి మార్గంలో నడిచి సమాజ శాంతికి తమ వంతుగా పాటుపడాలని కోరారు. ప్రభు ఆశీస్సులు ప్రజలందరికి ఉండాలని కోరుకుంటున్నాను అన్నారు. ఈకార్యక్రమంలో గూడూరి జగదీష్,తోట భోగయ్య, పాలవెల్లి మంగ, గంటా సుందర్‌కుమార్, రాజేష్ ఖన్నా, తదితరులు పాల్గొన్నారు.

రజకుల అభివృద్ధికి పరిష్కరిస్తా

భీమవరం(ప్రకాశం చౌక్): రజకులకు అన్నివిధాలుగా అండగా ఉండి రజకుల సమస్యలను పరిష్కరించి వారి అభివృద్ధికి కృషి చేస్తానని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. ఆదివారం భీమవరం 18వ వార్డు శ్రీ ఆదిలక్ష్మీ రజక సంఘ ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ కులాలకు జగనన్న ప్రభుత్వం అండగా ఉందని నవరత్నాల ద్వారా ఎన్నో పథకాలు అందజేసి పేద బడుగు బలహీనవర్గాలు అభివృద్ధికి కృషి చేసిందన్నారు. అందులో భాగంగా రజకులకు సంక్షేమ పథకాలు అమలు చేయడంతో పాటు ప్రత్యేక ఆర్థిక సాయం అందజేసి వారికి చేయూత ఇవ్వడం జరిగిందన్నారు. తనకు రజకులు అంటే ఏంతో అభిమానం అన్నారు. ఈకార్యక్రమంలో యువ నాయకులు గ్రంధి రవితేజ, రజక కార్పొరేషన్ డైరెక్టర్ రేవూరిగోగురాజు, భీమవరం రజక సంఘం అధ్యక్షుడు చింతాడ శ్రీను, సభ్యులు దొమ్మేటి సుబ్బయ్య, కొత్తపల్లి వెంకటేశ్వరరావు, నేదునూరి గంగాధర్ తిలక్, గరగపర్తి మల్లేశ్వరరావు, గరగపర్తి శ్రీహరి,అమానపు వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు తోట భోగయ్య, మాజీ కౌన్సిలర్ కోడే యుగంధర్, నందమూరి సుధాకర్,, మాదాను రంగబాబు ,మారోజు గణేష్, రజక సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు

సంక్షేమ ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి



వీరవాసరం మండలంలోని పలు గ్రామాల్లో ప్రత్యేక ప్రార్థనలో వైఎస్సార్‌సీపీ నాయకులు



వీరవాసరం మండలంలో అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం చేస్తున్న నాయకులు



టీడీపీ కార్యకర్తలను వైఎస్సార్ సీపీలోకి ఆహ్వానిస్తున్న దృశ్యం

వీరవాసరం: ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని కోరుతూ ఆదివారం వైఎస్సార్ సీపీ నాయకులు పలు చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్న సీఎం జగన్‌కి ప్రజలంతా బాసటగా నిలవాలని ఆకాంక్షించారు. రాష్ట్రంలో తిరిగి వైఎస్సార్‌సీపీ అధికారం చేపట్టాలని, భీమవరం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ మరోసారి విజయం సాధించాలని, ఎంపీగా గూడూరి ఉమాబాల విజయకేతనం ఎగరవేయాలని పెద్ద ఎత్తున ప్రార్థనలు చేశారు. ప్రజలందరికీ మంచి చేస్తున్న ప్రభుత్వం ఏర్పాటు కావాలని కోరారు. ఆయా కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కోటిపల్లి బాబు, జేసీఎస్ కన్వీనర్ మానుకొండ ప్రదీప్‌కుమార్, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ గొలగాని సత్యనారాయణ, వైసీపీ మండల కన్వీనర్ కడలి ధర్మారావు, గెడ్డం భారతి, సికిలే మంగతాయారు, నేతల జ్ఞాన సుందర్‌రాజు, గెడ్డం భాస్కర రావు, బొంతు రమేష్, పాలమూరి బుల్లిరాజు, చిలకపాటి సునీత, చిక్కాల రాజు, తానేటి ప్రసాద్, సర్పంచ్‌లు, ఎంపీటీలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీఎం జగన్‌కి అండగా నిలవాలి

బడుగు, బలహీనవర్గాల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్న పార్టీ ఒక్క వైఎస్సార్ సీపీ మాత్రమేనని పలువురు వక్తలు పేర్కొన్నారు. వీరవాసరం మండల వ్యాప్తంగా ఆదివారం గ్రామాల్లో బూత్ కన్వీనర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, బూత్ కన్వీనర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

జగన్‌తోనే అభివృద్ధి, సంక్షేమం

ఉండి: మోసపూరిత మేనిఫెస్టో, వాగ్దానాలతో అధికారంలోకి రావాలని చంద్రబాబు కుట్రలు పన్నుతున్నారని మండల ఎన్నికల ఇన్‌చార్జ్ పాతపాటి వర్మ అన్నారు. శనివారం ఎన్నార్పీ అగ్రహారం బీసీ కాలనిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వర్మ మాట్లాడుతూ అర్హత ఉన్న వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందజేశామన్నారు. సీఎం జగనన్న రాష్ట్రంలో స్వర్ణయుగం పాలన అందజేస్తున్నారని తెలిపారు. ప్రజా సంక్షేమమే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ ధ్యేయమన్నారు. రాష్ట్రంలో మళ్లీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని ప్రతి ఒక్కరూ ఆశీర్వదించాలని కోరారు. ఈ సందర్భంగా టీడీపీ మాజీ వార్డు సభ్యుడు తిరుమలరావుకు పార్టీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చేసిన సంక్షేమాని గుర్తించి అన్ని పార్టీల వారు జగన్ అభిమానులుగా మారిపోయారన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సూరవరపు కనకదుర్గవెంకటాచార్యులు, జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి యేడిద వెంకటేశ్వరరావు, గలావిల్లి ధనుంజయ, మాజీ సర్పంచ్ మునుకోలు సింహాచలం, కరిమెరక శివనాగరాజు, వి మాణిక్యాలరావు, బీ వీర్రాజు, బీ పుష్ప, ఆర్‌కే, శేషాద్రి శ్రీను, జంపా నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఉత్సాహంగా వేసవి శిక్షణ శిబిరాలు



భీమవరంలో ఫోకస్ సంస్థ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ శిబిరం ప్రారంభిస్తున్న దృశ్యం

భీమవరం: వేసవికాలంలో విద్యార్థులకు, యువతకు ఫోకస్ ఆధ్వర్యంలో హౌసింగ్ బోర్డ్ కాలనీలోని ఆదిత్య కళావేదికపై వేసవి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు కంతేటి వెంకటరాజు అన్నారు. ఆదివారం శిక్షణ తరగతులు ప్రారంభం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఫోకస్ అధ్యక్షుడు గొన్నాబత్తుల మల్లేశ్వరరావు మాట్లాడుతూ గత పదేళ్లగా వివిధ అంశాల్లో వేసవి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. శిక్షణలో యోగ, తెలుగు పద్యాలు, నటన, కోలాటం, డ్యాన్స్, మేకప్ వంటి అంశాలపై ఉచితంగా శిక్షణ ఇస్తున్నామన్నారు. ఈ శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళారంజని అధ్యక్షుడు జవ్వాది దాశరథి శ్రీనివాస్, జానపాటి మధు, ఏపీ ప్రజా నాట్యమండలి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం సీతారాం ప్రసాద్, ఆక్వా శ్రీనివాస్, చాన్‌బాషా, కళ్యాణి, శిరీష, హేమ తదితరులు పాల్గొన్నారు.

'ఇంటి నుంచే ఓటు హక్కు'ను సద్వినియోగం చేసుకోవాలి

ఉండి: ఇంటి నుంచే ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జిల్లా జాయింట్ కలెక్టర్ సీవీ ప్రవీణ్‌ఆదిత్య తెలిపారు. నియోజకవర్గంలో ఆదివారం ఉండి, కాళ్ల, ఆకివీడు, పాలకోడేరు మండలాల్లో 85 ఏళ్లు పైబడిన వృద్ధులు, 40 శాతం కంటే అధికంగా వైకల్యం ఎక్కువగా ఉన్న వారికి హోమ్ ఓటింగ్ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. దీనిలో భాగంగా నియోజకవర్గంలో 151 ఓట్లకు గాను 146 ఓట్లు పోలైనట్లు ఆయన తెలిపారు. నలుగురు మృతి చెందినట్లు తెలిపారు. ఉండి మండలంలో 63 ఓట్లుకు గాను 61 ఓట్లు, కాళ్ల మండలంలో 34 ఓట్లకు గాను 31 మంది, పాలకోడేరు మండలంలో 33 మందికి 33 మంది ఓట్లు వేసాశారు. ఆకివీడు మండలం, మున్సిపాలిటీ పరిధిలో 21 మందికి 21 మంది ఓట్లు వేసారని ఆర్వో తెలిపారు.ఆయా కార్యక్రమాల్లో ఎంపీడీవోలు, మున్సిపల్ కమీషనర్ ,డీటీలు, వీఆర్వోలు, బీఎల్వోలు పాల్గొన్నారు.